క్లుప్తంగా

ఘనంగా మరెమ్మ దేవర



గుండ్రేవులలో పూజలందుకుంటున్న మారెమ్మ

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవులలో గ్రామ దేవత మారెమ్మ వారి దేవర కార్యక్రమాలు బుధవారం ఘనంగా సాగాయి. అమ్మవారి దేవరలో భాగంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భక్తులు అమ్మవారి రథాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. బుధవారం ఉదయం కుంభం కాగులతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చూడండి

గూడూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య లోపం, సమస్యలు లేకుండా చూడాలని ఈఓఆర్డీ నాగమ్మ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. బూడిదపాడులో బుధవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్లపై చెత్తను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ కార్మికులు తిరిగి పొడి, తడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీలను గుర్తించి జేసీబీ ద్వారా శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సౌందర్య వెంట ఉన్నారు.

డ్రైనేజీలో చెత్తను తొలగించండి



చెత్త చెదారంతో నిండిన డ్రైనేజీ

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో డ్రైనేజీ కాలువ చెత్తచెదారంతో నిండి మురుగు నీరు ముందుకు పారడం లేదు. కాలువలో చెత్త చెద్దారం, పేపర్లు, ఖాళీ బాటిళ్లు, సీసాలు వేయడంతో ప్రవాహానికి అడ్డుపడి మురుగు నిల్వ ఉంటోంది. రోజుల తరబడి మురుగు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలో చెత్తను తొలగించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: పాడి రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సి.బెళగల్ పశు వైద్యుడు ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం సి.బెళగల్‌లోని పశు బీమా పథకానికి ముందుకు వచ్చిన పలువురు రైతులకు చెందిన పశువులకు గుర్తింపు నంబర్ కేటాయించి ఇనాఫ్ ట్యాగ్‌లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణ, సంరక్షణ, పాడి రైతుల సంక్షేమంలో భాగంగా ప్రీమియం చెల్లింపుతో పశువులకు బీమాను అందిస్తోందన్నారు. పూర్తి వివరాల కోసం గ్రామ సచివాలయాలను సంప్రదించాలని సూచించారు.

కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు బుధవారం డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 1.100 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణ బిల్లులు



ప్యాలకుర్తి జగనన్నకాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

కోడుమూరు రూరల్: పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వం సకాలంలో బిల్లులను చెల్లిస్తోందని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు పేర్కొన్నారు. ఆయన బుధవారం మండలంలోని ప్యాలకుర్తి జగనన్న కాలనీని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. డీఈఈ మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్ వంటి వాటిని సరఫరా చేస్తోందని, నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులను సకాలంలో చెల్లిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు ఏవీ?



నన్నూరు వద్ద బస్సు కోసం ఎండలో వేచివున్న ప్రయాణికులు



హుసేనాపురం వద్ద బస్సు కోసం ఎండలోనే ఎదురు చూస్తున్న దృశ్యం

- బస్సు షెల్టర్లు లేక అవస్థలు
- ఎండైనా, వానైనా రోడ్లపైనే భరించాల్సిందే
- పట్టించుకోని హైవే అధికారులు

ఓర్వకల్లు: భగభగ మండుతున్న భానుడి ప్రతాపానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు అసౌకర్యాల నడుమ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ పరిస్థితుల్లో జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై బస్సు షెల్టర్లు నిర్మించక పోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండలోనే వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

ఎండలోనే ఎదురుచూపులు

మండలంలోని నన్నూరు, పూడిచెర్ల, ఓర్వకల్లు, హెచ్ కొట్టాల, హుసేనాపురం, కాల్వబుగ్గ, సోమయాజులపల్లె గ్రామాల నుంచి ప్రతి రోజు ప్రయాణికులు వందల సంఖ్యలో కర్నూలు, బేతంచెర్ల, నంద్యాల, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆయా బస్సు స్టేజీల వద్ద షెల్టర్లు నిర్మించకపోవడంతో ఎండైనా, వానైనా రోడ్లపైనే భరించాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సుల కోసం మండుటెండలోనే వేచిఉండక తప్పడం లేదు. గుక్కెడు నీళ్లలేక, నిలువ నీడలేక చిన్న పిల్లలు మొదలు, వయోవృద్ధుల వరకు విలవిలలాడాల్సిందే. కొంత మంది ప్రయాణికులు తప్పని పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

హోటళ్లను ఆశ్రయిస్తున్న జనం

రోడ్లపై నిలవడానికి నీడలేక, తాగడానికి గుక్కెడు నీరులేక సమీపంలోని హోటళ్లు, టీస్టాళ్లు, కూల్ డ్రింక్ షాపులు, పండ్ల దుకాణాలను ఆశ్రయించి దాహార్తి తీర్చుకుంటున్నారు. ఎక్కువ మంది గుమికూడితే సదరు వ్యాపారస్తుల నుంచి ఛీదరింపులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. రహదారులపై అన్ని వసతులు సక్రమంగా ఉంటే చివాట్లు పడాల్సిన కర్మ ఉండేదికాదని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం పరుస్తున్నారు.

నిబంధనలు విస్మరించిన హైవే అధికారులు

జాతీయ రహదారిపై ప్రయాణం సాఫీగా సాగాలనే ఉద్దేశంతో హైవే అధికారులు పదేళ్ల క్రితం కర్నూలు– చిత్తూరు నాలుగు లైన్ల జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా విస్తరించారు. ఆ సమయంలో నిబంధనలను విస్మరించారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవానికి రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పుడు ప్రయాణికులు, వాహనదారుల సౌలభ్యం కోసం బస్సు షెల్టర్లు, మంచి నీటి సదుపాయం, సర్వీసు రోడ్లు, అండర్ ప్రాసెసింగ్ వంతెనలు, సిమెంట్ బెంచీలు, టెలిఫోన్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటిని ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమయాజులపల్లె, హెచ్ కొట్టాల వద్ద నిర్మించిన బస్సు షెల్టర్లు కూడా నిరుపయోగంగా మారాయి. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వసతులు సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

మెరుగైన సదుపాయాలు కల్పించాలి



వేసవి కాలంలో శుభకార్యాలు, పెళ్లిల్లు, విద్యార్థుల పరీక్షలు, ఉత్సవాలు, దేవరలు ఎక్కువగా జరగడం వల్ల ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటుంది. నిత్యం వందల సంఖ్యలో వ్యాపారస్తులు, ప్రయాణికులు కర్నూలు, నంద్యాల, బేతంచెర్ల, బనగానపల్లె ప్రాంతాలకు వెళుతుంటారు. హైవే నిర్మాణం చేపట్టి ఏళ్ల గడుస్తున్నా కర్నూలు వైపు వెళ్లే దారిలో ఎక్కడా బస్సు షెల్టర్లు నిర్మించకపోవ డం దారుణం. అనారోగ్యంతో బాధపడేవారు, ముసలి వారు బస్సుల కోసం నిలబడలేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే మంచి నీరు, బస్సు షెల్టర్లు, బెంచీలు, టాయిలెట్లను ఏర్పాటు చేయాలి.

– రవీంద్రనాథ్, ప్రయాణికుడు, కొమరోలు

ఓర్వకల్లు వద్ద బస్‌షెల్టర్ నిర్మాణానికి చర్యలు



ప్రయాణికుల సౌకర్యార్థం ఓర్వకల్లు వద్ద కర్నూలు వైపు వెళ్లే దారిలో బస్సు షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో రూ.8 లక్షలు ఎండీఎఫ్ నిధులు మంజూరు చేశారు. బస్సు షెల్టర్ నిర్మాణానికి టెండర్లు పిలిచాం. త్వరలోనే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. మహిళా ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల వద్ద తప్పనిసరిగా మాత్రశాలలు,బెంచీలు, షెల్టర్లు , మంచినీటి వసతి కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది.

– తోట అనూష, సర్పంచ్, ఓర్వకల్లు

ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో గ్రామ దేవత సుంకులా పరమేశ్వరీదేవి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని బుధవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి దినేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయం ట్రస్ట్ బోర్డు నియామకాన్ని ప్రభుత్వం చేపట్టిందని, చైర్మన్‌తో పాటు ఎనిమిది మంది సభ్యులు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడు బోర్డులో ఉంటారని, ఇందులో ఐదుగురు మహిళలు ఉంటారన్నారు. అలాగే తప్పనిసరిగా సభ్యుల్లో ఒకరు నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం చోటు కల్పించిందని ఆసక్తి కలిగిన వారు 20 రోజుల్లోగా కర్నూలులోని దేవాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు నందనపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 2వ తేదీ శుక్రవారం కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని కర్నూలు ఎంపీడీఓ ఎస్.భాస్కర్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



శరీన్ నగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలతో పాటు చెప్పని వాటిని కూడా ప్రజలకు అందిస్తున్నామన్నారు పార్టీలు, మతాలు, కులాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ కాలువలు, రోడ్లు, కల్వర్టులు వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ జయరాముడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పెద్దన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణం

ఓర్వకల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా చేపడుతున్నట్లు హౌసింగ్ ఏఈ రామయ్య తెలిపారు. బుధవారం ఆయన ఇళ్ల పురోగతిపై హౌసింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, ఉప్పలపాడు, కేతవరం, బ్రాహ్మణపల్లె, శకునాల తదితర గ్రామాలలో మొత్తం 1892 ఇళ్లు మంజూరుకాగా, అందులో ఇప్పటివరకు 1670 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైనట్లు తెలిపారు. 655 ఇళ్లు పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, కడ్డీలు, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

పొగాకు అనర్థాలపై అవగాహన



గడివేములలో పొగాకు అనర్థాలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గడివేముల: పొగాకుతో వాడకంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మొల్లా జబీన్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జబీన్ మాట్లాడుతూ.. బీడీ, సిగరెట్లు, గుట్కా తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. పొగాకును అధికంగా వాడటం వల్ల ఊపిరితిత్తులు దెబ్బతిని క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ధూమపానం చేయడం వల్ల ఆరోగ్యవంతులు జబ్బుల పాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. వైద్య సిబ్బంది ఉత్తయ్య, రాజ్‌కుమార్, ఏఎన్‌ఎం మౌలా బీ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



ప్యాలకుర్తి గ్రామ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయ సిబ్బంది పని వేళల్లో కచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. ఆయన బుధవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. సిబ్బంది ప్రతి రోజూ నిర్ణీత సమయంలోగా సచివాలయానికి హాజరు కావాలని, మధ్యాహ్నం తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పండ్ల తోటల సాగుపై ఆసక్తి గల రైతులను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



సి.బెళగల్‌లో ఉపాధి సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ అల్లిపీరా ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, ఉపాధి పథకం అధికారులతో కలిసి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. మండలంలో రోజువారి కూలీల సంఖ్య ఆరువేలకు పైగా ఉండగా, ఇప్పటివరకు దాదాపు ఐదు వేల మంది మాత్రమే పనులకు వస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారులు మండలానికి ఇచ్చిన లక్ష్యాలను అధికారులు, సిబ్బంది సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. కూలీల వివరాలు, పనుల ఫొటోలను అప్‌లోడ్ చేయడంలో మేటీలు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇకపై పనులపట్ల మేటీలు నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సీనియర్ మేట్లు, ఎఫ్ఏలు, టీఏలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంపీడీఓ హెచ్చరించారు. అదేవిధంగా ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి పండ్లు, పూల తోటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాలలో ఉపాధి పనుల కల్పన, నిర్వహణ, పర్యవేక్షణపై అధికారుల సూచనలను సిబ్బందికి తెలియజేశారు. ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్, టీఏలు తదితరులు ఉన్నారు.

పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి లక్ష్యం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- 39వ వార్డు బాలాజీ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



బాలాజీనగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సంక్షేమం, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ సుపరిపాలన సాగిస్తున్నారని కోడుమూరుఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం 39వ వార్డు బాలాజీ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్పొరేటర్,సచివాలయ కన్వీనర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి లబ్ధిదారులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో 98 శాతానికి పైగా హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నెరవేర్చారని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించి ఆర్థికంగా బలపరుస్తున్నారని అన్నారు . సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తుండడంతో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఓర్వలేక ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్పొరేటర్ సాంబ, సచివాలయ కన్వీనర్లు కరీం, ముజమ్మిల్, అనీస్, ఇస్మాయిల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక నగర పాలక సంస్థ సమావేశ భవనంలో 38, 39, 40 వార్డుల వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ వలంటీర్ల సేవలను కొనియాడారు. ఆయా వార్డులోని మొత్తం 130 వలంటీర్లను సేవామిత్ర, ఒకరిని సేవారత్న పురస్కారాలతో సత్కరించి, శాలువా, మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, టౌన్ పీఓ వెంకటలక్ష్మి, మెప్మా సూపరింటెండెంట్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం పోరాటం

పాణ్యం: ఎస్సీల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటాలు గ్రామగ్రామాన చైతన్యం నింపుతున్నాయని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. బుధవారం పాణ్యం మండలం కొండజుటూరు, గోరుకల్లు గ్రామాల్లో గోటూ 50 డేస్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎంఎస్ఎఫ్ బాబు మాట్లాడుతూ.. వర్గీకరణ కోసం కొన్నేళ్లుగా మందకృష్ణ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని తీరా అధికారంలోకి వచ్చాక మాదిగల గోడు వినడం లేదన్నారు. దీంతో మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారన్నారు. వర్గీకరణ కోసం అన్ని గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. గద్దల సుబ్బయ్య, జాషువా, ఓబులేసు, ఓబులపతి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఉదయం కాల్వ బుగ్గ ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ, లక్ష్మీనరసింహ శర్మ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశిష్ట పూజలు చేశారు. ఉదయం దింబశుద్ధి, నవగ్రహ ధ్వజ జపాలు, బలిహోమం, తీర్థప్రసాద వితరణ, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, మహా మంగళ హారతి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

దరఖాస్తు చేసుకోండి

గడివేముల: స్థానిక మోడల్‌స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ సూచించారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 10వ తేదీన మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

కల్లూరు: మండలంలో అక్రమ అడ్మిషన్లు, ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ప్రైవేటు విద్యాసంస్థల అక్రమాలపై చర్చించారు. కార్యవర్గ సభ్యులు మునిస్వామి, నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు తీవ్ర నష్టం



గడివేములలో మాట్లాడుతున్న డీఈ రమణారెడ్డి

గడివేముల: గత కొన్ని రోజులుగా భారీ ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు నంద్యాల ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి తెలిపారు. బుధవారం గడివేముల విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న జూనియర్ ఇంజినీర్ రంగరాజు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా అకాల వర్షాలు, ఈదురుగాలులకు నంద్యాల జిల్లాలలోని 17 మండలాల్లో విద్యుత్ శాఖకు రూ.1.5 కోట్లు నష్టం వచ్చిందన్నారు. ఆయా మండలాల్లో పడిపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ గాలులకు 33, 11 కేవీ లైన్ల స్తంభాలు విరిగి పడ్డాయని చెప్పారు. వెంటనే సిబ్బంది శ్రమించి విద్యుత్ సరఫరా పనరుద్ధరించినట్లు చెప్పారు. రానున్నది వర్షకాలం కావడంతో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా గాలులకు వైర్లు తెగిపడితే స్థానిక విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని అర్జీలు పెట్టుకున్న రైతులకు నెల రోజుల్లోపే మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. డీఈఈ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈఈ రవికుమార్, కాంట్రాక్టర్ శేషాద్రిగౌడ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు భరోసా



నేలను దుక్కిదున్నుతున్న రైతన్న

గడివేముల: ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కానుక అందించనుంది. ఏటా మాదిరిగానే వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా పంటల సాగుకు పెట్టుబడి సాయం అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో కర్షకుల కష్టాలు చూసి చలించిపోయి ఆర్థికంగా అండగా నిలుస్తానని ఇచ్చిన హామీ మేరకు వరుసగా నాలుగో ఏడాది డబ్బులను అకౌంట్లలో జమ చేయనున్నారు. రైతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా రూ.13,500 సాయం అందిస్తోంది. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రదర్శించారు. గురువారం పత్తికొండ నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతు భరోసా సాయం రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు.

పథకం అమలు ఇలా:

2019 అక్టోబర్ 15 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీఎం కిసాన్-వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో ఖరీఫ్ పంటకు ముందు రూ. 7500, రబీ అవసరాల కోసం రూ.4 వేలు, ధాన్యం ఇంటికి చేరే సంక్రాంతివేళ జనవరిలో రూ.2 వేలు జమ చేస్తూ రైతన్నలకు అర్థికంగా అండగా నిలుస్తున్నారు.

మండలంలో 7165 మంది అర్హులు

మండలంలోని 14 ఆర్బీకేల పరిధిలో రైతు భరోసా పథకానికి 7,165 మంది రైతులు అర్హత సాధించారు. కరిమద్దెల- 943, కొరటమద్ది-280, కొర్రపోలూరు-650, గడిగరేవుల-539, గడివేముల-358, గని-722, చిందుకూరు-836, చెనకపల్లె- 676, తిరుపాడు-278, దుర్వేశి-252, పెసరవాయి-485, బిలకలగూడూరు-543, బూజునూరు-453, మంచాలకట్ట-158 మంది అన్నదాతలు అర్హులుగా ఉన్నారు.

పంటల సాగుకు ఉపయోగపడుతుంది



గత ప్రభుత్వాలు రైతుల గురించి పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఏటా రైతు భరోసా పథకం కింద రూ.13,500 నగదు బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం చేస్తున్న సాయం సేద్యపు ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వీటితో పాటు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, గిట్టుబాటు ధర, ఆర్బీకేల సేవల ద్వారా రైతులకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారు.

– అల్తాఫ్, రైతు, గడివేముల